ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024

సూరిబాబు రాజీనామా

శ్రీకాకుళం అర్బన్ : కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవికి అంధవరపు సూరిబాబు రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో 2020లో చైర్మన్‌గా నియమితులైనప్పట్నుంచీ కళింగ వైశ్యుల అభ్యున్నతికి కృషి చేశానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, నవరత్నాలను అర్హులైన వారందరికీ అందించేలా పనిచేశానని తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను స్పెషల్ చీఫ్ సెక్రటరీ బిసి వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు రిజిస్టరు పోస్టు ద్వారా పంపించినట్లు తెలిపారు. ఇప్పటివరకు తనకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయంకృతాపరాధం

- వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం
- అభ్యర్థులపైనా అంతే స్థాయిలో వ్యతిరేకత
- నియోజకవర్గాల అభివృద్ధిని విస్మరించిన వైనం
- ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న ఫ్యాన్ పార్టీ



కర్ణుడి చావుకు కారణాలెన్నో అన్నట్లు జిల్లాలో ఫ్యాన్ పార్టీ ఘోర పరాజయానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా జిల్లా అభివృద్ధి, వెనుకబాటుపై పలు ప్రజాసంఘాలు, అభివృద్ధి వేదికలు ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నా పాలక పక్షం పట్టించుకున్న పాపాన పోలేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతి నుంచి గానీ వేరే చోట బహిరంగ సభ నుంచి బటన్ నొక్కడం, ఇక్కడ వైసిపి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందించడం ఇలా ఐదేళ్లుగా ఇదే తంతు కొనసాగింది. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వం నుంచి నిధులు రప్పించి నియోజకవర్గం అభివృద్ధి చేద్దామన్న ఉద్దేశమే కనిపించలేదు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే ఎన్నికల్లో తమను గట్టెక్కిస్తాని అతి విశ్వాసం కనబరిచారు. దాని ఫలితమే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయానికి దారితీసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వైసిపి ఘోరంగా చతికిలపడింది. గతంలో ఏ రాజకీయ పార్టీ ఇంతటి పరాభవాన్ని మూటగట్టుకోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ హవాలో జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలకు గానూ ఒక్క ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మాత్రమే గెలిచి టిడిపి ఘోర ఓటమి నుంచి తప్పించుకుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభంజనంలో టెక్కలి, ఇచ్ఛాపురంలో విజయం సాధించి టిడిపి పరువు దక్కించుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో జిల్లాలోని ఒక ఎంపీ స్థానంతో సహా ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఓటమిపాలైంది. అసెంబ్లీలో జిల్లా నుంచి ఆ పార్టీకి కనీసం ప్రాతినిధ్యం లేకుండా పోయింది. వైసిపి ఓటమికి అటు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహంతో పాటు అభ్యర్థులపైనా అంతేస్థాయి వ్యతిరేకత ఉందన్న చర్చ సాగుతోంది. వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ప్రాజెక్టు దాదాపు 90 శాతం, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ సుమారు 50 శాతం పూర్తయినా దాన్నీ ఈ ఐదేళ్ల కాలంలో పూర్తి చేయలేకపోయింది. నదుల అనుసంధానం పనులూ అసంపూర్ణంగానే ఉన్నాయి. పలాసలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసినా వైద్యులు, వైద్య సిబ్బంది, మౌలిక వసతులు కల్పించలేదు. ఐదేళ్ల కాలంలో జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. రోడ్లు శిథిలమైనా కనీసం మరమ్మతు పనులూ చేపట్టకుండా వదిలేశారు. అభివృద్ధిని విస్మరించడంతో దాని ప్రభావం ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అభివృద్ధిని విస్మరించిన ఫలితమేనా?

సొంత ఇమేజ్, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉంటే పార్టీల ప్రభంజనం ఉన్నా, నెట్టుకొచ్చిన పరిస్థితిని గతంలో చూశాం. 2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా ఇచ్ఛాపురం నుంచి టిడిపి ఎమ్మెల్యేగా పిరియా సాయిరాజ్ ఒక్కరే గెలిచారు. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభంజనంలోనూ టెక్కలి నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో వైసిపి అభ్యర్థులందరూ కొట్టుకుపోయారు. సంక్షేమ పథకాలు గెలిపిస్తాయన్న అతి విశ్వాసం, ఎన్నికల్లో ప్రచారంలో వాటిపై తప్ప అభివృద్ధి అంశాల జోలికి వెళ్లకపోవడంతో ఘోరంగా ఓటమిపాలయ్యారు.

అభ్యర్థులపైనా తీవ్ర వ్యతిరేకత

వైసిపి అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత ఉండడమూ వారి ఓటమికి దారితీసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. వీటికితోడు నియోజకవర్గాల్లో నెలకొన్న గ్రూపుల పోరూ పతనానికి కారణమన్న చర్చ నడుస్తోంది. తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్ కుటుంబసభ్యుల పెత్తనాన్ని సహించలేకపోయారు. ఇసుక తవ్వకాలు, భూముల ఆక్రమణ, పనుల కోసం కమీషన్లు వంటి ఆరోపణలూ మూటగట్టుకున్నారు. దీంతోపాటు 2019 ఎన్నికల్లో తమ గెలుపు కోసం పనిచేసిన కేడర్‌ను దూరం చేసుకోవడంతో ఓటమి చవిచూశారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై తొలి నుంచి నియోజకవర్గంలో వ్యతిరేకత ఉంది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభంజనంలోనూ స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు. టెక్కలి నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎమ్మెల్సీ దువ్వాడ చేసిన అరాచకాలు, కుటుంబంలో నెలకొన్న విభేదాలు, గ్రూపుల పోరు ఓటమికి కారణమయ్యాయి.

పలాసలో 2019 ఎన్నికల్లో తన విజయం కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన ముఖ్య నాయకులు, కేడర్‌ను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దూరం చేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. దీంతోపాటు నియోజకవర్గంలో పలు కొండలను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. వీటితో పాటు ఇతరత్రా ఆర్థిక ఆరోపణలూ లేకపోలేదు. ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో అభ్యర్థులపై నెలకొన్న తీవ్ర అసమ్మతి, ఇసుక తవ్వకాలు, కమీషన్ల వంటి ఆరోపణలతో గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతిని ఓటర్లు తిరస్కరించారన్న చర్చ సాగుతోంది.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహేల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్ సంగీత, అజీజ్ శుక్లదాస్‌లు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు ఎన్నికల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పోలింగ్ నిర్వహణ, స్ట్రాంగ్‌రూమ్ భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎస్‌పి జి.ఆర్ రాధిక పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారని తెలిపారు. ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ రిటర్నింగ్ అధికారులకు సూచనలు, పలు ఆదేశాలు ఇస్తూ ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల మేరకు కౌంటింగ్ వేగంగా జరిగేలా, ఫలితాలను సకాలంలో వెల్లడించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో మంగళవారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, పోలీసు అధికారులకు, సిబ్బందికి, రాజకీయ పార్టీలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో గెలుపొందిన పార్లమెంట్ అభ్యర్థి, నియోజకవర్గాల శాసనసభ్యులకు అభినందనలు తెలిపారు.

మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కాలుష్య కోరల నుంచి బయటపడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. ప్రకృతిలో సమతుల్యత కోల్పోవడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోలేకపోతే రానున్న రోజుల్లో చాలా సమస్యలకు గురవుతామన్నారు. అటువంటి సమస్యను అధిగమించాలంటే ప్రస్తుతం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. అప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, ఎఎస్‌పి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాచలం

'ఉపాధి'కి కేంద్రం తూట్లు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సింహాచలం

ప్రజాశక్తి - గార

పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం విమర్శించారు. మండలంలోని జొన్నలపాడు, సతివాడలో ఉపాధి పని ప్రదేశాలను బుధవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. వలసలను నివారించి, పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం రక్షణకు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. కొత్తగా ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాది కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో రూ.రెండున్నర లక్షల కోట్ల కేటాయింపులు ఇవ్వాలన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ, నారాయణమ్మ, పందిరి హేమలత, జమాన పార్వతి, కర్రి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతం

- తమ్మినేని అక్రమాలపై విచారణ చేస్తాం
- ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి సాగించిన అరాచక పాలనకు ప్రజలు అంతం పలికారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనంతా విధ్వంసాలు, విద్వేషాలతోనే సాగిందని విమర్శించారు. గత ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారని, ప్రజలు ఇచ్చిన ఆ అవకాశాన్ని కక్షసాధింపులు, వేధింపులకు వాడుకున్నారని ఆరోపించారు. వైసిపి అధికారంలోకొచ్చాక మొదటి కేసు తనపైనే పెట్టిందని తెలిపారు. చంద్రబాబు నాయుడుతో పాటు టిడిపి ముఖ్య నాయకులు పలువురిని అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. తాను కుప్పకూలేంత వరకు ఎన్నో తప్పులు చేశారన్నారు. వాటన్నింటినీ ప్రజలు గమనించి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో వారే పాడె కట్టారని వ్యాఖ్యానించారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, అదే సమయంలో అభివృద్ధిని ఎప్పుడూ ఆపలేదన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్టాన్ని అప్పులపాల్జేశారని దుయ్యబట్టారు. అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మడు తమకు ఎందుకు ఓటు వేయలేదో అర్థం కావడం లేదని జగన్ చెప్పడం సిగ్గుచేటన్నారు. జగన్ పరిపాలన చూసే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని తెలిపారు. జగన్ పాలనలో అన్ని వ్యవస్థలూ నాశనమయ్యాయని ఆరోపించారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో తమ్మినేని సీతారాం అరాచకాలు పరాకాష్టకు చేరాయన్నారు. ఆయన అక్రమాలు, నకిలీ సర్టిఫికేట్లపై విచారణ చేపడతామన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ చరిత్రలో భారీ విజయం ఈసారి తనకు దక్కిందన్నారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రజా తీర్పును శిరసావహిస్తా

తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, వారు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసినా ఎన్నికల్లో ప్రజల నుంచి ఆశించిన స్పందన లభించకపోవడం బాధాకరమన్నారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినా, ప్రజలు ఇలా తీర్పు ఇచ్చారన్నారు. ఎన్నికల ఫలితాలు తనను చాలా నిరాశపరిచాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలో జరిగిన లోపాలను తాము బేరీజు వేసుకుంటామని తెలిపారు. ఓటమిపై వైసిపి శ్రేణులు అధైర్యపడొద్దన్నారు. అందరం సమిష్టిగా పార్టీ కోసం పనిచేసి, పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ఈ ఐదేళ్లు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు.

నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా గెలిచిన అభ్యర్థులను నడుచుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని కోరుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైసిపి నాయకులు కోట గోవిందరావు, కోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో రైతులకు 36 వేల క్వింటాల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ ఎడి కార్యాలయంలో వ్యవసాయ అధికారులు, డీలర్లతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాల మొలక శాతం పరీక్షించాలని, ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఎడి బి.వి తిరుమలరావు, ఎఒ గురుగుబెల్లి రంగారావు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. నూతన ప్రభుత్వ సారథి చంద్రబాబు నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన సాగించి అందరి మన్ననలూ అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించి దేశంలోనే అగ్రగామిగా నిలపాలని కోరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న చంద్రబాబు నాయుడు, ఆయన నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని దశ, దిశ నిర్దేశించే క్రమంలో సమున్నత నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, వారి ప్రతిపాదనలన్నింటినీ సానుకూలంగా పరిగణించి మానవతను చాటుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యోగులు ఆందోళన చెందుతున్న సిపిఎస్ రద్దుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్‌ఎస్) కార్డులు పనిచేసేలా, అర్హులకు సంబంధిత పథకం ప్రయోజనాలు అందచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీపై దృష్టిసారించాలని కోరారు. ఉద్యోగ, కార్మిక, శ్రామిక వర్గాల మన్ననలు అందుకునేలా గుడ్ గవర్నెన్స్‌కు కేరాఫ్‌గా చంద్రబాబు నాయుడు నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాలో కొత్తగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు.

12 నుంచి బస్సు పాసులు

జిల్లా ప్రజా రవాణాధికారి విజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన విద్యా సంవత్సరానికి ఈనెల 12వ తేదీ నుంచి కొత్త బస్సు పాసులు జారీ చేయనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఆర్‌టిసి రాయితీ పాసుల కోసం పాత వెబ్‌సైట్ స్థానంలో కొత్తది అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు తీసుకుని ఆన్‌లైన్‌లో apsrtcpass.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని పలాస, టెక్కలి, శ్రీకాకుళం బస్‌స్టేషన్లలోని బస్ పాస్ కౌంటర్లలో రాయితీ, ఉచిత పాసులను పొందవచ్చని తెలిపారు. జిల్లా పరిధిలో ఎంఎస్‌టి పాసులపై తిరిగే ప్రయాణికులకు పాసుల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వెబ్‌సైట్ ఈనెల 6, 7 తేదీల్లో పనిచేయదని, 8వ తేదీ నుంచి యధావిధిగా బస్ పాసుల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

బిసి గురుకులంలో సీట్ల భర్తీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిసి సంక్షేమశాఖ పరిధిలో గార మండలం అంపోలు దరి శాస్త్రుల పేట వద్ద నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం(బాలురు)లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బిసి గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆయా పాఠశాలల్లో (ఇంగ్లీష్ మీడియం) మిగిలి ఉన్న ఖాళీలను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఇబిసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రాథమిక వివరాలతో రూ.వంద చెల్లించి https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20న మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9618880991 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

స్వాగతం పలుకుతున్న మహిళలు

మీ రుణం తీర్చుకోలేనిది

ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఎన్ని జన్మలెత్తినా ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ముచ్చటగా మూడోసారి విజయం సాధించిన అనంతరం ఎమ్మెల్యే అశోక్ బుధవారం ఉదయం శ్రీకాకుళం నుంచి కవిటి చేరుకున్నారు. ఈ సందర్భంగా కొజ్జిరియా కూడలి వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికిన కూటమి నాయకులు ర్యాలీగా వెంట నడిచారు. రాజపురం, బొర్రపుట్టుగ మీదుగా కవిటి చేరుకున్న ఆయన చింతామణి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విజయం తనకు మరింత బాధ్యత పెంచిందని అన్నారు. ముఖ్యంగా 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం అటు అభివృద్ధి, అటు సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, బెందాళం రమేష్ సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, లోల్ల శ్రీను, పుల్లట సంతోష్, సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సతీష్

ఎఐతోనే భవిష్యత్

ప్రజాశక్తి- నరసన్నపేట

ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎంచుకునే మార్గంతోనే వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ మాకేన సతీష్ పేర్కొన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్‌లో డిగ్రీని పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఇప్పుడు ఈ డిగ్రీ ఇంజినీరింగ్‌తో పాటు సాధారణ డిగ్రీలోనూ అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే, డ్యూయల్ డిగ్రీతో కూడా విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఆన్‌లైన్‌లో ఒక డిగ్రీ చేస్తూనే... ఆఫ్‌లైన్‌లో మరొక డిగ్రీ పట్టా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గుణుపూర్ రైలు రద్దు

పాతపట్నం: విశాఖపట్నం నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు నేడు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిలారు - కోటబొమ్మాళి, నౌపడ- కోటబొమ్మాళి, నౌపడ- పూండి మధ్య రైల్వే ట్రాక్ పనులు పనులు గురువారం చేపడుతున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్యాసింజర్ రైలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిని ప్రయాణికులు గమనించాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రేపటి తరాన్ని కాపాడటం మన బాధ్యతని శ్రీకాకుళం సుడా అధ్యక్షులు చల్లా ఓబులేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన స్థానిక శాంతి నగర్ కాలనీలోని గాంధీ మందిరంలో బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతితో మనం బాధ్యతగా ఉంటే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం నగరంలోని డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పాత బస్టాండ్‌తో పాటు పలు ముఖ్య కూడళ్లలో ప్రజలకు ఏడు వందల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ బి.దేవభూషణం, సెక్రటరీ టి.రాంగోపాల్, ట్రెసరర్ ఎస్.మణి, చల్లా జోషత, గాంధీ మందిరం రాజారావు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో డిఇఒ కె.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారిలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిసి రీజనల్ కో-ఆర్డినేటర్ నల్లా కుమారస్వామి, ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు, సమగ్ర శిక్షా ఎఎంఒ గుంట లక్ష్మీనారాయణ, సిఎంఒ పేడాడ ప్రభాకరరావు, పూడి జనార్థనరావు, గ్రీన్ టీచర్లు సువ్వారి ఉమామహేశ్వరి, రావాడ పాపారావు, ఎల్.కృష్ణవేణి, ఐ.రేవతి పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా మొక్కలు నాటారు.

'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల ర్యాలీ

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో ఉన్న కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం... పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు... ప్లాస్టిక్ వద్దు మట్టే ముద్దు.. అనే నినాదాలు చేస్తూ నగరంలో ర్యాలీని నిర్వహించి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్ ఎం.నాగభూషణరావు, కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, టి.పద్మావతి, ఎస్.వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలాస : మానవాళి మనుగడకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టిడిపి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని, నిరంతరం వాటిపై దృష్టి పెట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూర్యతేజ జూనియర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షులు ఎం.కామేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కాశీబుగ్గ, అక్కుపల్లి, అక్కుపల్లి మెట్టూరు రోడ్డు ఇరువైపులా కదంబ, బాదం, కాము, చెర్రీ తదితర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం ప్రపంచ ప్రగతికి మూలం, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలే ఆధారం కాబట్టి ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి భూతాపాన్ని నియంత్రించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉష్ణోగ్రతలు పెరగడానికి, రుతువులు క్రమం తప్పడానికి కారణం పర్యావరణం అదుపు తప్పడమే. కాబట్టి ప్రతి వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లండ లోలాక్షి రామలింగం, ఉపాధ్యాయులు లిరవీంద్రనాథ్ ఠాగూర్, సేవా సంఘ ఉపాధ్యక్షులు ఎం.జయశంకర్, ట్రెజరర్ సోమశేఖరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అలాగే పలాస -కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన డాక్టర్ వి.కణితిస్ ఐటిఐ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైల జవహర్, క్లబ్ అధ్యక్షులు రోనంకి హేమాచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, వీరఘట్టం వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక అంగన్వాడీ-4 కేంద్రం ఆవరణలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి విమలకుమారి మొక్కలను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌస్య బేగం, కార్యకర్తలు ఎస్.రమణమ్మ, హెల్పర్ ప్రమీల, ఉపేంద్ర, బుజ్జి రామారావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద మొక్కలను నాటారు. కార్యక్రమంలో న్యాయవాదులు పొట్నూరు ఆనందరావు, దాడి దర్మారావు, పేడాడ ఆజాద్, సాయిరాజ్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని జ్ఞానభరతి విద్యా సంస్థల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కార్యదర్శి జోహర్ ఖాన్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ సుల్తాన్, పిఇటి కైలాస్ కుమార్ పండా పాల్గొన్నారు.

పొందూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బ్రహ్మజీ, రామ్‌మోహన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న సన్యాసిరావు

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పలాస : మొక్కలు నాటుతున్న దానేటి పద్మజీ, గోపాల్

ఎచ్చెర్ల : మొక్కను నాటుతున్న బాలాజీ

ఇచ్ఛాపురం : మొక్కను నాటుతున్న జోహార్‌ఖాన్

ఎచ్చెర్ల : శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విద్యార్థి జిమ్నాసా సెంటర్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పెద్దింటి ముకుందరావు, పిఒలు డాక్టర్ జి.ఈశ్వరరావు, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సింహాచలం పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మన భూమి- మన భవిష్యత్ అనే అంశంపై టెక్కలి ఆధిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యాన అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హెచ్.రామ్మోహనరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డి డాక్టర్ పి.పినకర్ పాల్గొన్నారు.

పాతపట్నం : సత్య సాయి భజన మండలి ఆధ్వర్యాన జిల్లా ఇన్‌ఛార్జి బోయిన చంద్రమౌళి తెంబూరు శివాలయం రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కన్వీనర్ అంధవరపు కామేశ్వరరావు, గుండబోలు భాస్కరరావు, సత్య సాయి బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధి పాత్రో, సిఇఒ బి.శంకరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడి వారి ఆకాంక్షలను నెరవేర్చాలని గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ముందుగా రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో 164 స్థానాల్లో గెలుపొంది అధికారం చేపట్టనున్న కూటమి ఎమ్మెల్యేలకు సచివాలయ ఉద్యోగుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు సమాజాన్ని చైతన్య పరుస్తూ ఉంటారని అన్నారు. తమ హక్కులను కాలరాసిన ప్రభుత్వానికి ప్రజల్లో వచ్చిన తిరుగుబాటుకి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వం ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఉద్యోగుల పలుమార్లు పలు సమస్యలపై విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఏనాడు పరిష్కరించలేదన్నారు. నూతనంగా ఏర్పడే ప్రభుత్వమైన తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు అండగా నిలబడాలని కోరారు.

గొండు శంకర్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయాన్ని అందుకున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్య కర్తలు అభినందనలతో ముంచెత్తారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న టిడిపి నియోజకవర్గ కార్యాల యం వద్ద బుధవారం కోలాహలంగా మారింది. గ్రామాల నుంచి పెద్దఎత్తున అభిమానులు రావడంతో ఆ ప్రాంతంలో రోడ్లు కిక్కిరిసిపోయాయి. వారి అదుపు చేసేందుకు రూరల్ సిఐ ఎల్.సన్యాసి నాయుడు ఆధ్వర్యాన పోలీసుల బందోబస్తు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు వచ్చి ఆయనను ఆశీర్వదిస్తుంటే యువత కేరింతలతో సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు, పళ్లు పంపిణీ చేశారు.

అభినందనలు తెలుపుతున్న అభిమానులు

సంక్షిప్త వార్తలు

టెక్ మహేంద్రకు పది మంది ఎంపిక

టెక్కలి రూరల్ : సాఫ్ట్‌వేర్ దిగ్గజం టెక్ మహేంద్రకు టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 2023-24లో ఉత్తీర్ణత పొందిన సిఎస్ఇ, ఇసిఇ, ఐటి బ్రాంచీలకు చెందిన పది మంది ఎంపిక కాగా, ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.3.25 లక్షల వేతనం చెల్లించేందుకు ఆ కంపెనీ అంగీకరించిందని పేర్కొన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంపికైన విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డిలు డాక్టర్ యు.డి.ప్రసన్న, డాక్టర్ బి.రామారావు, డాక్టర్ వై.రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.కుమార్ అభినందించారు.

సమస్యలపై పోరాడుతా

ఆమదాలవలస : సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనకు ఓటు వేసి ఆదరించిన ప్రజలకు సువ్వారి గాంధీ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా ఎన్నికల్లో సునామీలా ప్రభంజనం సృష్టించి నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న కూటమి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభంజనంలోనూ తనకు 10 వేల ఓట్లు వచ్చాయని అన్నారు. భవిష్యత్‌లోనూ తనపై అభిమానం ఇలాగే కొనసాగించాలని కోరారు. నియోజవర్గ ప్రజల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

టెక్కలి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్ ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించి పరీక్షల తీరుని సమీక్షించారు. అలాగే విద్యార్థులు హాజర శాతాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్మాణంలో ఎటువంటి అపోహలకు తావి వద్దని కోరారు. చీఫ్ సూపరింటెండెంట్ రోణంకి శ్రీనివాసరావుతో మాట్లాడే పరీక్షలు తీరుపై కఠినంగా ఉండాలని సూచించారు. వీరితో పాటు డిపార్ట్‌మెంట్ అధికారి కురుమన దాలయ్య, ఎంఇఒ డి.చిన్నారావు ఉన్నారు.

నీటి సరఫరా నిలుపుదల

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా చేస్తున్న మూడో భావి మరమ్మతులకు గురికావడంతో ఆరేడు తేదీల్లో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని కమిషనర్ కె.నాగేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బావి మరమ్మతులు కారణంగా పంపింగ్ నిలిపివేశామని, అంతవరకు అద్దె ట్యాంకర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎంపిపి శుభాకాంక్షలు

కోటబొమ్మాళి: సార్వత్రిక ఎన్నికల్లో మంగళవారం విడుదలైన ఫలితాల్లో శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులుగా వరుసగా మూడో సారి విజయం సాధించిన కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, టెక్కలి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన కింజరాపు అచ్చెన్నాయుడులకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయనతో కలిసి పలువురు వైసిపి సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు అభినందనలు తెలిపారు.

కూటమి నాయకుల సంబరాలు

కొత్తూరు: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయం సాధించిన సందర్భంగా మండలంలోని పారాపురంలో టిడిపి నాయకులు బుధవారం సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎద్దు దాసునాయులు పాల్గొని కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. గోవిందరావుకు గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెట్టూరు బిట్-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, అరుబోలు దశరథ, పడల వెంకట కృష్ణ, జనసేన నాయకులు జయరాజ్, రాజీవ్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యేగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్, పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘన విజయం సాధించడంతో మండల కేంద్రంలో కూటమి నాయకులు బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ మేడుకు మూడు రోడ్ల కూడలి వద్ద జనసేన నాయకులు డోల క్రాంతికుమార్ ఆధ్వర్యాన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే రెడ్డిక రెడ్డిక వీధిలో మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యాన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దుక్క బాలరాజు, సవలాపురం చంటి, చిన్నబాబు మాస్టర్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

రణస్థలం : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 7 8 9 తరగతిలో మిగిలి ఉన్న సీట్లు భర్తీ కొరకు ప్రవేశపరీక్షను ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆశక్తి గల విద్యార్థులు ఈ నెల 11లోగా తగిన ధ్రువపత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8978615698 సెల్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

'నీట్'లో విద్యార్థుల ప్రతిభ

పలాస : అభినందిస్తున్న తల్లిదండ్రులు

టెక్కలి : టెక్కలి పట్టణానికి చెందిన మల్లిపెద్ది ప్రణణసాయి మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. నీట్ ఫలితాల్లో 710 మార్కులు సాధించి ఆల్‌ఇండియా కేటగిరిలో 430వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 114వ ర్యాంకు సాధించారు. ఇప్పటికే ప్రణణసాయి తెలంగాణా ఎంసెట్‌లో 62వ ర్యాంకు సాధించారు. నీట్‌లో ర్యాంకు సాధించిన ప్రణణ్‌సాయి తండ్రి మధుసూద నరావు వ్యాపారస్తుడు. తల్లి సంతోషికుమారి స్థానిక ప్రయివేట్ పాఠశాల్లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రణణ్‌సాయి నీట్‌లో ర్యాంకు సాధించడంపై పలువురు అభినందించారు.

పాతపట్నం: మండలంలోని తీమరకు చెందిన బండి గౌతమి మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను, 705 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 925వ ర్యాంకు, రీజనల్ స్థాయిలో 288వ ర్యాంకు సాధించింది. ఆదర్శ పాఠశాలలో చదివిన ఆమె ఇంటర్ బైసిపిలో 953 మార్కులు సాధించారు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో 30వ ర్యాంకు సాధించింది. ఈమెకు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి. రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించారు.

ఎచ్చెర్ల : మండలంలోని ఫరీదుపేటకు చెందిన కోటిపాత్రుని నవ్యశ్రీ నీట్‌లో సత్తా చాటింది. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో 270 మార్కులకు గాను 583 మార్కులు సాధించి ఓబిసి కేటగిరీలో 47,834 ర్యాంకు సాధించింది.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన బోడ కళ్యాణ్ నీట్ పరీక్షలో 3810 ర్యాంకు సాధించారు. ఆల్ ఇండియాలో 9000 ర్యాంకు రాగా, ఒబిసి కోటాలో 3810 ర్యాంకు సాధించారు. రాజమండ్రి శశి కళాశాలలో సిబిఎస్‌సిలో ఇంటర్మీడియట్ 460 మార్కులు సాధించగా, పదో తరగతిలో శ్రీచైతన్య పాఠశాలలో చదివి 577 మార్కులు సాధించాడు. నీట్‌లో ర్యాంకు సాధించడంతో ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించాకున్నాడు. తండ్రి బాబూరావు, స్నేహితులు శ్యాంప్రసాద్, సురేష్, మోహన్, మురళి, మదన్మోహన్ అభినందనలు తెలిపారు.

శిరీషకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

గౌతు శిరీష ఇంటికి క్యూ

పలాస : పలాస టిడిపి కార్యాలయం, ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటికి నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టారు. మంగళవారం ఉదయం 8 నుంచి రాత్రి వరకు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యక ర్తలు తండోపతండాలుగా తరలివచ్చి శిరీషకు, టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన పదవిని బాధ్యతగా భావిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. వారికి ఓటు రూపంలో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రంలో 164 సీట్లు ఇచ్చి ఎన్‌డిఎ కూటమి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనకు అఖండ విజయాన్ని చేకూర్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తల కు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

అశోక్‌కు ఘన స్వాగతం

సోంపేట : మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టిన బెందాళం అశోక్‌కి బుధవారం కొర్లం జాతీయ రహదారి వద్ద స్థానిక టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి, ఆర్.వెంకటరమణ, పార్టీ అధ్యక్షుడు ఆర్.జానకిరావు ఎమ్మెల్యేకు పూలమాలలు వేశారు. చంద్రబాబు నాయుడు నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న తర్వాత స్వగృహానికి వస్తున్న తరుణంలో జాతీయ రహదా రి వద్ద ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టి.వాసుదేవరావు, సోమేష్, చందు, ప్రతాప్, సంతోష్ జగదీష్, సురాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, మడ్డు రవికుమార్ పలికారు.

అశోక్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

తాగునీరు సరఫరా

కోటబొమ్మాళి: గత ఐదేళ్లుగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న కోటబొమ్మాళి మండల కేంద్రంలోని ఒకటో వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ బుధవారం తాగునీరు సరఫరా చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ట్యాంకుల ద్వారా తాగునీరు అందించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకటో వార్డుకు టిడిపి శ్రేణులతో ప్రచారానికి వెళ్లిన రమేష్‌కు వార్డు ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మీ వార్డుకు తాత్కాలికంగా ట్యాంకుల ద్వారా తాగునీరు అంది స్తామని, తరువాత ఇంటింటికీ కుళాయిలు వేసి శాశ్వతంగా తాగునీరు అందస్తానని హామీ ఇచ్చారు.

తాగునీటిని సరఫరా చేస్తున్న రమేష్

మాట్లాడుతున్న ఎపిఒ మోహనరావు

వంద రోజుల పని తప్పనిసరి

కవిటి: ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పనిదినాలు తప్పనిసరిగా కల్పించాలని ఎపిఒ టి.మోహనరావు సూచించారు. మండలంలోని క్షేత్ర సహాయకులతో స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి పనికల్పనలో ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పిస్తూ అంచనాలు తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా వారికి మొక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందించారు

హేంబాబు చౌదరి

పలాస: ఇదేళ్ల అరాచక పాలనను ప్రజలు అంతమొందించారని వజ్రపు కొత్తూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకుడు దువ్వాడ హేంబాబు చౌదరి అన్నారు. కాశీబుగ్గ ఆయన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అహంకారమే వైసిపి ఓటమి కారణమన్నారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సొంత పార్టీ నేతలను అణచివేయడం, కాళింగ నాయకులపై దాడులు చేయించారని, చొక్కా పట్టుకుని లాగేస్తా అంటూ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలే గౌతు శిరీషకు 40 వేలు మెజారిటీ తెచ్చి పెట్టిందన్నారు. రాజకీయాల్లో అహంకారం పనికి రాదన్నారు. 2019లో అప్పలరాజు వెనుకున్న నాయకులు ఈ ఎన్నికల్లో ఇప్పుడు ఒక్కరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికీ పని అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మలో వన్నల రేవతి (27) బుధవారం ఇంట్లోని ఫ్యాన్ కొక్యానికి సున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవతి భర్త కృష్ణారావు స్థానిక అగ్నిమాపక కేంద్రంలోని కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లగా భార్య ఫ్యాన్ కొక్యానికి వేలాడుతూ కనిపించింది. వెంటనే గ్రామస్తుల సహకారంతో కిందకు దించి స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వీరికి వివాహమై ఎనిమిదేళ్ల అవుతుంది. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. వీరిది సారవకోట మండలం కుమ్మరిగుంట. ఉద్యోగ రీత్యా కర్లెమ్మ ఉంటున్నారు. మృతురాలికి కుమార్తె జన్విశ్రీ ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ ఎ.అహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌదీ అరేబియాలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని చినవంకకు చెందిన యువకుడు మదనాల శంకర్ అలియాస్ సతీష్ (32) బుధవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఇతను నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ మృతి వార్త విన్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడు తల్లి కాంతమ్మ గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. మృతినికి తండ్రి సూర్య నారాయణతో పాటు చెల్లి ఉన్నారు. మృతదేహం గ్రామానికి తీసుకువచ్చే విధంగా నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

ఇది ప్రజా విజయం

పోలాకి: ఈ ఎన్నికల్లో ఉమ్మడి కూటమి విజయం అనేది ప్రజా విజయంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభివర్ణించారు. మండలంలోని మబగాంలో ఆయన స్వగృహంలో కూటమి కార్యకర్తలు ఆయనకు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మబగాం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అయిదేళ్ల వైసిపి అరాచక పాలనలో ప్రజలు విసిగిపోయి చరమగీతం పాడారని అన్నారు. అనుభవజ్ఞుడు, పరిపాలన దక్షుడు చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రజలు కోరుకుని సిఎం చేయడం ఆనందంగా ఉందన్నారు. తమను ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సహకారం మరువలేనిది

శ్రీకాకుళం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున తనకు టిక్కెట్టు ఇచ్చిన నాయకత్వంతో పాటు ఆదరించిన ఓటర్లకు శ్రీకాకుళం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి అంబటి కృష్ణారావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో జయాపజయాలు సర్వసాధారణమని, ప్రజాక్షేత్రంలో నిరంతరం కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజల కోసం పోరాటం చేస్తామని అన్నారు. ఎన్నికల్లో గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహించే సమయంలో అనేక సమస్యలను ప్రజలు తన దృష్టికి తెచ్చారని అన్నారు.